సాక్షి జగిత్యాల

గురువారం । 14 । డిసెంబర్ । 2023



గోదావరిలో పోటెత్తిన భక్తులు

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి భక్తులతో బుధవారం పోటెత్తింది. పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.



పసుపు పంటకు తెగుళ్లు

జిల్లాలో పసుపు ప్రధాన పంట. ధర ఉన్నా..లేకున్నా పసుపును ఇంటి పంటగా భావించి ప్రతి రైతు ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/17.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. సాయంత్రం, రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను పరామర్శించిన మాజీమంత్రి కొప్పుల



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

జగిత్యాల/ధర్మపురి: యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం బాగుపడాలని శ్రీలక్ష్మీనృసింహస్వామిని వేడుకున్నారు.

సమష్టి కృషితో విజయం



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న గెజిటెడ్ నాయకులు

జగిత్యాల: సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని, ఇందులో ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కలిసి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఇది ఉద్యోగులందరి సమష్టి కృషి అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్, మామిడి రమేశ్, కందుకూరి రవిబాబు, విజేందర్, విశ్వన్, ప్రభు, కిరణ్, రాజేశ్వరి, శైలజారాణి పాల్గొన్నారు.

సీఎంఆర్ త్వరగా అప్పగించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లులు ప్రభుత్వానికి త్వరితగతిన అప్పగించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. వానకాలం సీఎంఆర్ చెల్లించేందుకు ప్రభుత్వం ఈనెల 31వరకు గడువు ఇచ్చిందని, 60శాతం తక్కువ చెల్లించిన రైస్‌మిల్లర్లు త్వరితగతిన అప్పగించాలని సూచించారు. మిల్లుల నుంచి డెలివరీ చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. ఈ సమావేశంలో మిల్లర్లు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని ఆటోడ్రైవర్ల ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటోడ్రైవర్లు, ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తూ బుధవారం పట్టణంలోని గాంధీచౌక్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు జీవన భృతి కింద నెలకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, షఫీ, రాజశేఖర్, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

చెరుకు రవాణా భారం



ఈ చిత్రంలోని రైతు క్యాతం రవీందర్‌రెడ్డి. మల్లాపూర్ మండలం చిట్టాపూర్. ఈయనకున్న ఐదెకరాల్లో చెరుకు పంట సాగుచేయగా సుమారు 200 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఆ పంటను కామారెడ్డి సమీపంలో ఉన్న గాయత్రీ షుగర్స్ ఫ్యాక్టరీకి క్రషింగ్ కోసం తరలించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఒక్కో లారీలో 20 టన్నుల చొప్పున మొత్తం పది లారీల్లో చెరుకు పంటను తరలించాల్సి ఉంది. ఇందుకు ఒక్కో లారీకి రవాణా చార్జీ కింద టన్నుకు రూ.500 చొప్పున మొత్తం రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన పది లారీలకు రూ.లక్ష రవాణా చార్జీ కిందనే పోనుంది. గతంలో ముత్యంపేటలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ నడిచినప్పుడు చెరుకును ఎండ్ల బండ్లపై తరలించడంతో రూపాయి కూడా ఖర్చయ్యేది కాదు. ఫ్యాక్టరీ మూతపడడంతో రూ.లక్ష అదనపు భారం పడుతోంది. ఇది ఒక్క రవీందర్‌రెడ్డి ఆవేదన కాదు.. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని వందలాది మంది చెరుకు రైతుల పరిస్థితి.

- కామారెడ్డికి తరలిస్తున్న రైతులు
- టన్నుకు రూ.500 చొప్పున నష్టం
- మొదలైన చెరుకు క్రషింగ్
- ముత్యంపేట ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్



కామారెడ్డిలోని ఫ్యాక్టరీకి లారీలో తరలిస్తున్న చెరుకు

మల్లాపూర్: జిల్లాలోని చెరుకు రైతులకు ఈ క్రషింగ్ సీజన్‌లో రవాణా కష్టాలు తప్పడం లేదు. ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని మూసివేయడంతో ఎనిమిదేళ్లుగా చెరుకును కామారెడ్డి జిల్లాలోని గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీకి క్రషింగ్ కోసం తరలిస్తున్నారు. ఇందుకు రవాణా చార్జీలు తడిసి మోపెడవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నడిచే ఫ్యాక్టరీని మూసివేయడంతోనే తమపై అదనంగా భారం పడుతుందంటూ గత ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారమిస్తే చక్కెర ఫ్యాక్టరీలు తెరిపిస్తామన్న కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పాటయిన కొత్త ప్రభుత్వంపైనే చెరుకు రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ఫ్యాక్టరీ మూతపడి ఎనిమిదేళ్లు

ఉమ్మడి రాష్ట్రంలో 1980–81లో అప్పటి మంత్రి వర్దినేని వెంకటేశ్వర్‌రావు సహకారంతో నిర్మించిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ 35 ఏళ్లుగా తెలంగాణకే తలమానికంగా నిలిచిన స్వరాష్ట్రంలోనే ఎన్‌డీఎస్‌ఎల్ యజమాన్యం 2015 డిసెంబర్ 23న లేఆఫ్ నిర్ణయంతో మూతపడింది. ఎనిమిదేళ్లుగా చెరుకు రైతులు నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి ప్రభుత్వమే నడపాలని ఆందోళన చేస్తున్నా వారి గోడును ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఏడేళ్లుగా చెరుకు పంటను వ్యయాప్రయాసలతో 150 కిలోమీటర్ల దూరంలో గల కామారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు.

పడిపోయి పెరుగుతున్న చెరుకుసాగు

ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూసివేతతో జిల్లాలో 2015 నుంచి 2021 వరకు చెరుకు పంట సాగు గణనీయంగా తగ్గింది. ఫ్యాక్టరీ మూతపడ్డ రెండేళ్లలో సుమారు 1500 నుంచి 1200 ఎకరాల్లో సాగు చేయగా.. తర్వాత రెండేళ్లు వెయ్యి ఎకరాలకు పరిమితమైంది. మూడేళ్ల క్రితం ప్రభుత్వం నియంత్రిత సాగు, యాసంగిలో వరి వేయవద్దన్న నేపథ్యంలో జిల్లాలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చెరుకును ఎంచుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం 2500 ఎకరాలకు పైగా పెరిగింది. అయితే చెరుకును క్రషింగ్ కోసం కామారెడ్డి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తుండడంతో రైతులపై రవాణాచార్జీల రూపంలో భారం పడుతోంది. టన్నుకు రూ.500 వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు లక్ష టన్నుల చెరుకు దిగుబడి వస్తుందని అంచనా. ఈ లెక్కన రైతులు రూ.5 కోట్ల వరకు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



మూసివేసిన ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ

ప్రభుత్వమే పూర్తిగా భరించాలి



నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయడంతో పంటను కామారెడ్డి జిల్లాకు తరలించాల్సి వస్తోంది. చెరుకురైతులపై రవాణా చార్జీల భారం పడుతోంది. ముత్యంపేట ఫ్యాక్టరీ తెరిపిస్తే ఈ భారం పడదు. హామీ మేరకు కొత్త ప్రభుత్వం ఫ్యాక్టరీ తెరవాలి.

– నోముల రాజరెడ్డి, చెరుకు రైతు

తెరిపించేందుకు కమిటీ



నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫ్యాక్టరీల పునరుద్దరణ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. త్వరలోనే ఫ్యాక్టరీలను తెరిపిస్తుంది.

– వాకిటి సత్యంరెడ్డి, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

ఫ్యాక్టరీ తెరిపించాలి



ముత్యంపేట ఫ్యాక్టరీ తెరిపించాలి. రైతుల ప్రయోజనార్థం హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి. ప్రభుత్వం నడిపించినా.. ప్రైవేటు పరం చేసినా రైతులకు అభ్యంతరం లేదు.

– మామిడి నారాయణరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

జిల్లాకో రెవెన్యూ బోర్డు



ఎమ్మెల్సీతో ఉపాధ్యాయ, రెవెన్యూ సంఘం నాయకులు

జగిత్యాలజోన్: ధరణి సమస్యల పరిష్కారానికి జిల్లాకో రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం మాట్లాడుతానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్సీని కలిశారు. వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను తొలగించడం ద్వారా రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, గ్రామస్థాయిలో పాలన లోపించిందని, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలే ఉండడంతో భూ సమస్యలు పేరుకుపోతున్నాయని తెలిపారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో స్థానికత దెబ్బతిందన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలను భర్తీ చేయాల్సి ఉందన్నారు.

ఫిల్టర్‌బెడ్స్ వినియోగంపై సీఎం దృష్టికి

రాయికల్: రాయికల్, పొలాస, బీర్‌పూర్ ఫిల్టర్‌బెడ్‌ల వినియోగంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ తెలిపారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్‌బెడ్‌ను బుధవారం పరిశీలించారు. సాగు, తాగునీరు, విద్యుత్‌కు సీఎం ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. రామాజీపేట చెరువును ఎస్సారెస్పీ కెనాల్‌తో అనుసంధానం చేస్తే చాలాగ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈనెల 17 నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదలకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మండల నాయకులు గన్నవరం ప్రభాకర్, పడిగెల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే

కాంగ్రెస్‌కు ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని, ఇందులో భాగంగానే సీఎం బెల్ట్‌షాపులు ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్సీ అన్నారు. బెల్టుషాపుల ఎత్తివేత నిర్ణయానికి మహిళల్లో మంచి స్పందన వస్తోందని గుర్తుచేశారు.

ఉద్యోగులకు స్థానికత కల్పిస్తాం

జగిత్యాలటౌన్: 317 జీవో కారణంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు న్యాయం చేస్తామని, ఉమ్మడి పది జిల్లాలను జోన్లుగా ఏర్పాటు చేసి స్థానికత ఆధారంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను తమ సొంత జిల్లాలకు చేర్చేలా త్వరలోనే నిర్ణయం ఉండబోతుందని ఎమ్మెల్సీ తెలిపారు. ప్రతి పాఠశాలకు ఒక స్కావెంజర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచుతామన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘం సంఘం నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు,ఎన్నం రాంరెడ్డి, మల్లారెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత



విద్యార్థుల నృత్యాలు

- అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: విద్యార్థులు లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కల్చరల్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు కలిగి వాటి కోసం పోరాటం చేయాలని, కష్టిస్తే ఏది అసాధ్యం కాదన్నారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, డెప్యూటీ ఈఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదమే బలం

- ఆదర్శజిల్లాగా ఉమ్మడి కరీంనగర్
- దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఆశీస్సులే ఇంతటివాడిని చేశాయి
- పొన్నం అంటేనే కాంగ్రెస్
- ఎస్‌ఆర్‌ఆర్ నుంచే రాజకీయ జీవితం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్‌లోని ఇందిరాచౌక్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యక్రమానికి హాజరైన పార్టీ అభిమానులు, కార్యకర్తలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్: ఉమ్మడి కరీంనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల అని, రాజకీయ ఉద్దండులు వైఎస్.రాజశేఖరరెడ్డి, జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్, జి.వెంకటస్వామి, జైపాల్‌రెడ్డి నుంచి అక్షరాలు నేర్చుకున్నానని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం పొన్నం ప్రభాకర్ కరీంనగర్ వచ్చారు. నగరంలోని ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన విజయభేరి సభలో ఆయన మాట్లాడుతూ సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల సహకారంతో ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళతామన్నారు. గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, తమది చేతల ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం మారిందని, అధికారులు కూడా వ్యవస్థను మార్చుకోవాలని సూచించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనని, తాను కరీంనగర్ బిడ్డనన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అధ్యక్షుడిగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేశానన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో కరీంనగర్ ఎంపీ అయ్యానన్నారు. తన రాజకీయ గురువు జువ్వాడి చొక్కారావు 1973లో రవాణా శాఖ మంత్రి అయితే, చొక్కారావు శిష్యుడినైనా తాను 2023లో రవాణాశాఖ మంత్రి అయ్యానన్నారు. తాను 1987లో రాజకీయ జీవితం ప్రారంభించానని, ఈ 36 ఏళ్లలో ఎక్కడా అవినీతి తావులేదని, ఆరోపణలూ లేవన్నారు. కొంతమంది పార్టీలు మారినోళ్లు తనను విమర్శిస్తే, భగవంతుడు ఒక్క అవకాశం ఇస్తాడని చెప్పానంటూ గుర్తు చేసుకున్నారు. తాను పార్టీ మారలేదని కాంగ్రెస్ అంటే పొన్నం, పొన్నం అంటేనే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. తనకు ప్రజల ఆశీర్వాదమే టానిక్ అని, కేసీఆర్ వాడే టానిక్ కాదంటూ చమత్కరించారు. ఎంపీగా తాను పార్లమెంట్‌లో తెలంగాణ కోసం కొట్లాడి, మా ఎంపీ పొన్నం అని ప్రజలు గర్వంగా చెప్పుకునేలా చేశానన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించి ప్రజల ఆశలు నెరవేర్చిన నేత పొన్నం ప్రభాకర్ అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో నాలుగు స్థానాలు గెలిపించుకున్నానని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియంతృత్వ ప్రభుత్వం కూలిపోయి, ప్రజాప్రభుత్వం వచ్చిందన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పొన్నం మంత్రిగా బాధ్యతలు చేపట్టడం శుభసూచకమన్నారు. కరీంనగర్, హుజూరాబాద్ కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మెనేని రోహిత్‌రావు, మంజులారెడ్డి, కటకం వెంకట రమణ పాల్గొన్నారు.

దారిపొడవునా నీరాజనం

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, అనుబంధ విభాగాలు, పొన్నం అభిమానులు, కుల, బీసీ సంఘాలు ఘనస్వాగతం పలికాయి. సా యంత్రం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంలతో కలిసి ఓపెన్‌టాప్ వాహనంలో నగరానికి చేరుకున్న పొన్నం ప్రభాకర్‌కు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద పూలవర్షంతో నీరాజనం పట్టారు. ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి కోతిరాంపూర్, కమాన్‌చౌరస్తా, సిక్‌వాడీ, శ్రీపాదచౌక్ మీదుగా ఇందిరాచౌక్ వరకు అడుగడుగునా స్వాగతం పలికారు. కోలాటాలు, నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కోతిరాంపూర్‌లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గొల్లకురుమలు గొంగడితో సత్కరించారు. సిక్‌లు కరవాలం బహుకరించారు. ఆర్టీసీ కార్మికులు గజ మాలతో సన్మానించారు. ఇందిరాచౌక్ వద్ద విజ యభేరి సభ ముగిసిన తరువాత పొన్నం ప్రభా కర్ ర్యాలీగా డీసీసీ కార్యాలయానికి చేరుకున్నా రు. అక్కడ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్ల సతీశ్, కొడూరి రవీందర్‌గౌడ్, మునిగంటి అనిల్, దన్ను సింగ్, ఖమర్, సిరాజొద్దీన్, మొహమ్మద్ అమీర్, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న బోగ శ్రావణి

రాయికల్: ప్రజాసమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిఒక్కరం సిద్ధంగా ఉండాలని, ఎవరూ అధైర్య పడొద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. పట్టణంలో బుధవారం పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో 42వేలకుపైగా ఓట్లు సాధించామని, అదే స్ఫూర్తితో ప్రజల్లోకి వెళ్దామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. మండలంలోని ధర్మాజీపేట, రాజనగర్, రామరావుపల్లి, చెర్లకొండాపూర్ గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు నడవడం లేదని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం శుభపరిణామమే అయినా ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, వారికి ప్రభుత్వం నుంచి ఉపాధి కల్పించాలని కోరారు. పట్టణంలో దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉన్న ఫిలర్‌బెడ్, మాదిగకుంటను వినియోగంలోకి తీసుకురావాలని, పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేద్దామన్నారు. పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, మండల అధ్యక్షుడు వేణు, జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మీ, ఎంపీటీసీలు ఆకుల మహేశ్, రాజనాల మధు, బీజేపీ సీనియర్ నాయకుడు మచ్చ నారాయణ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యేగా తొలిసారి కథలాపూర్‌కు వచ్చిన ఆయనను కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరందించే కలిగోట సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలన సాగిస్తామన్నారు. మండలస్థాయి అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ.అజీమ్, తొట్ల అంజయ్య, బైర దేవ్‌యాదవ్, పులి హరిప్రసాద్, కారపు గంగాధర్, పాల్తెపు గంగారాం, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, స్వామిరెడ్డి, కల్లెడ గంగాధర్, దేవారెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

- సమస్యలపై సంజయ్‌కుమార్ ఆరా



దుర్గమ్మ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సంజయ్‌కుమార్

మల్లాపూర్: కాలనీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయా..? అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ఆయన మార్నింగ్‌వాక్ చేశారు. గాంధీనగర్, చెంచుకాలనీ, దుర్గమ్మకాలనీలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. తనను గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటానని, అందుకే మన ఊరికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించానని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గొట్టిపడుత రాజు గల్ఫ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకుని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీష్, ఆర్‌డబ్ల్యూస్ డీఈ అనంద్, ఏడీఏ లావణ్య, పీఆర్ ఏఈ నిరంజన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పది రోజుల్లోనే రెండు పథకాలు

- ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పెగడపల్లిలో ప్రజాఅభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి: కాంగ్రెస్ అధికా రంలోకొచ్చిన పది రోజుల్లోనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో రెండింటిని అమలు చేసి చూపించామని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లికి వచ్చిన ఆయనను కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందించుట విజయవంతంగా అమలు జరిగేలా పార్టీశ్రేణులు అధికారులకు సహకరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, సీనియర్ నాయకుడు గజ్జల స్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఏఎంసీ చైర్మెన్ శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, కార్యకర్తలు అధైర్యపడొద్దని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి శివారులో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా కార్యకర్తలు కలిసి ఉండాలన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో ప్రభుత్వం మారడం జరిగిందని, అయినా 39 మందితో గట్టి ప్రతిపక్షంగా ఉందామన్నారు. జెడ్పీచైర్‌పర్స న్ దావ వసంత, ఎంపీపీ ములాసపు లక్ష్మీ, జెడ్పీటీసీ మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మున్సిపాలిటీలో అవినీతి

- అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోతోందని, అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ కలెక్టర్‌కు 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ వినతిపత్రం అందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి కమిషనర్ ఉన్నా పరిపాలన వ్యవస్థ గాడి తప్పిందని, ఏ విభాగంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. బయోమెట్రిక్ లేదని, హాజరు రిజిస్టర్ రాయడం లేదని, అసలు ఆఫీసర్లు వస్తున్నారా..? లేదా..? తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సీసీకెమెరాలు పనిచేయడం లేదని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తి అవినీతికి పాల్పడుతున్నా విచారణ చేపట్టడం లేదని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా శేఖర్



శేఖర్‌కు నియామకపు పత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రావు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన కాసారపు శేఖర్ నేషనల్ హ్యూమన్ రైట్స్(ఎన్‌హెచ్‌ఆర్సీ) యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్‌ఆర్సీ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తామని, శేఖర్ పలు సామాజిక సేవల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రావు చేతులమీదుగా నియామకపు పత్రాన్ని అందించారు.

రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

వీణవంక(హుజూరాబాద్): మండల కేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్థానిక తహసీల్దార్, పోలీసులు పట్టుకున్నారు. సుమారు 45 నుంచి 50 క్వింటాళ్ల బియ్యాన్ని గ్రామానికి చెందిన కడమంచి యాదగిరి, ఉబిది నరేశ్, అనిల్, పర్దం శ్రీనివాస్ నుంచి స్వాధీనం చేసుకొని సివిల్ సప్‌లై అధికారులకు అందించినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమల్‌రావు, డీటీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూరులో మంగళవారం రాత్రి జరిగింది. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్ మధురనగర్‌కు చెందిన శనిగరపు సాయికుమార్(16), చిలువేరు విజయ్ ద్విచక్రవాహనంపై నెల్లూరు నుంచి కరీంనగర్ వస్తున్నారు. అజాగ్రత్తగా బైక్ నడపడంతో అల్గునూరు బ్రిడ్జిపై అదుపు తప్పి స్తంభానికి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్, స్వల్ప గాయాలైన విజయ్‌ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయికుమార్ మృతిచెందాడు. మృతుడి తండ్రి శనిగరపు బానేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ పోలీసులు తెలిపారు.

పసుపు పంటకు తెగుళ్లు

- ఆందోళనలో రైతులు
- జిల్లాలో 35 వేల ఎకరాల్లో సాగు
- అధిక వర్షాలతో దిగుబడి అంతంతే..



దుంపకుళ్లు రోగంతో ఊరని పసుపు



మర్రాకు రోగం సోకిన పసుపు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పసుపు ప్రధాన పంట. ధర ఉన్నా..లేకున్నా పసుపును ఇంటి పంటగా భావించి ప్రతి రైతు ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఇప్పటికే పంటకు సరైన ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ ఏడాది తెగుళ్లతో మరింత నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ ఏడాది అత్యధిక వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులతో పంటకు తెగుళ్లు సోకడంతో పెట్టిన పెట్టుబడైనా వస్తుందా..? రాదా..? అనే సంశయంలో పసుపు రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో 35 వేల ఎకరాల్లో పసుపు సాగు

జిల్లాలో దాదాపు 35 వేల ఎకరాల్లో పసుపు పంటను సాగుచేస్తున్నారు. అత్యధికంగా మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, జగిత్యాల, గొల్లపల్లి, రాయికల్, సారంగాపూర్ మండలాల్లో సాగవుతోంది. పసుపు పంట విత్తిన తర్వాత నెలపాటు పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు భూమిలో నీరు నిల్చింది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి తెగుళ్లు, పురుగులకు నిలయంగా మారింది. దీనికి తోడు మారిన వాతావరణ పరిస్థితులు కూడా పసుపు పంటకు తెగుళ్లు సోకేలా చేశాయి. పంటకు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువు వేస్తుంటారు. భూమిలో నీటి నిల్వతో సేంద్రియ ఎరువుల పోషకాలు పసుపు మొక్కకు అందకుండా పోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రంగా దుంపకుళ్లు తెగులు

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పసుపు పంట ఆకులు పచ్చగా ఉండి భూమిలో దుంపకుళ్లు రోగం సోకితే.. మరికొన్ని ప్రాంతాల్లో పసుపు ఆకులు ఎండిపోయి భూమిలో దుంప మురిగిపోయింది. పంటకు నవంబర్ నుంచి జనవరి వరకు కొమ్ములు ఊరే దశ. ఈ దశలోనే పంటకు దుంపకుళ్లు రోగం సోకడంతో నష్టం తీవ్రంగా ఉంటుంది. పసుపు దుంపలో పురుగులు చేరి గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కుళ్లిపోతుంటాయి. దుంపలో పసుపు రంగుకు బదులు మట్టి రంగు ఉంటుంది. కాండంవేరు కుళ్లిపోయి.. ఒత్తితే నీరు కారుతుంది. ఒక్క జిల్లాలోనే దాదాపు 15వేల ఎకరాల్లో దుంపకుళ్లు రోగం సోకినట్లు తెలుస్తోంది. గతేడాది ఎకరాకు 40 డ్రమ్ములు (25 క్వింటాళ్లు) పసుపు దిగుబడి వస్తే ఈ ఏడాది కనీసం 20 డ్రమ్ములు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

దెబ్బతీసిన వర్షాలు

ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో భూమి నుంచి నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు వేసిన ఎరువులను మొక్క తీసుకోకపోవడంతోపాటు పురుగులు, తెగుళ్లకు నిలయంగా మారింది. రైతులు రెండుమూడు సార్లు అధిక ఖర్చు పెట్టి కలుపు మొక్కలు తీసివేశారు. రైతులు ఎకరాకు కనీసం రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఆ పెట్టుబడి కూడా వచ్చేలా లేవని ఆందోళన చెందుతున్నారు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు చేపట్టినా సరైన దిగుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి



ఎకరాకు రూ.లక్ష చొప్పున నాలుగెకరాలకు రూ.4లక్షలు పెట్టుబడి పెట్టిన అధిక వర్షాలతో దుంపకుళ్లు రోగం సోకి దాదాపు రెండెకరాల్లో పంట నష్టం జరిగింది. పంట పైకి బాగానే కనబడుతున్నా.. లాగితే మొక్క ఊడి వస్తుంది.

– పన్నాల తిరుపతి రెడ్డి, పసుపు రైతు

నీరు నిలిచింది



రెండెకరాల్లో సాగు చేసిన. పంట పరిస్థితి బాగా లేదు. భూమిలో వర్షానికి నీరు నిలిచి.. పంటకు తెగుళ్లు సోయాయి. సగం కూడా దిగుబడి రాని పరిస్థితి ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనబడటం లేదు.

– ఎడమల సత్యం, పసుపు రైతు

దెబ్బతీసిన వర్షాలు



ఈ ఏడాది నెలరోజుల పాటు వర్షాలు కురువడం పసుపు పంటకు ఇబ్బందిగా మారింది. నీరు బయటకు వెళ్లక పసుపు పంటలోనే రోజుల తరబడి నీరు నిల్వడంతో దుంపకుళ్లు, అడుగు రోగం సోకి, దిగుబడులు వచ్చేలా లేదు.

– నల్ల స్వామిరెడ్డి, పసుపు రైతు

పిల్లల సమగ్ర సర్వే

- బడిబయట ఎందరున్నారు..
- ఏం చేస్తే వారు పాఠశాలకొస్తారు
- కసరత్తు చేస్తున్న అధికారులు
- వచ్చేనెల పదో తేదీ వరకు ప్రక్రియ

జగిత్యాల: పిల్లలకు చదువు ఎంతో ముఖ్యం. వారి భవిష్యత్‌కు పునాది వేసేది చదువే. కానీ.. చాలామంది బడి బయటనే ఉండిపోతున్నారు. కొందరు ఆర్థిక కష్టాలతో.. మరికొందరు ఇంట్లో పరిస్థితుల కారణంగా చదువుకు దూరమవుతున్నారు. ఇలాంటి వారికోసం ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలనే నినాదంతో ప్రతి యేటా (అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో సర్వే ప్రారంభమైంది. ఈనెల 11న ప్రారంభమైన సర్వే వచ్చేనెల పదో తేదీ వరకు కొనసాగుతుంది. ముఖ్యంగా ఈ శిక్షణ అధికారులు జిల్లాలోని ఇటుకబట్టీలు, వివిధ దుకాణాలు, హోటళ్లలో పనిప్రదేశాల్లో తిరుగుతూ పిల్లలను గుర్తిస్తూ బడికి వచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. కూలీ పనులు చేసుకునేవారి చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించనున్నారు.

చిన్నారుల గుర్తింపు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సర్వేలో భాగంగా 6 నుంచి 14 ఏళ్లు, 16నుంచి19 ఏళ్ల వయస్సు గల చిన్నారుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా గతంలో బడికి హాజరుకానివారు, మొత్తానికే రాని వారిని గుర్తించి పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ఇప్పటికే అధికారులు ప్రతి చోటకు తిరుగుతూ పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా సీఆర్పీలు సర్వే చేసి హెచ్‌ఎంలు, ఎంఈవోలకు ఎంతమంది మొత్తానికే రానివారు ఉన్నారు..? ఎంతమంది చిన్నారులు బడి మానేసిన వారున్నారు..? వివరాలు అందజేస్తారు. అనంతరం విద్యాధికారి పరిశీలించి ఆమోదం చేస్తారు. పదో తరగతి పాసై ఉన్న విద్యార్థులు సైతం ఇంటర్ విద్యను కచ్చితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒకవేళ చదువు మానేసిన ఓపెన్ ఇంటర్‌లో చేర్పించేలా కూడా చూస్తున్నారు. బడీడు చిన్నారులను చేర్పించడంలో పోలీసు శాఖ, ఐసీడీఎస్, వైద్యశాఖ, కార్మిక శాఖ, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు.



సర్వే చేస్తున్న సర్వశిక్ష అభియాన్ అధికారులు

జిల్లాలో క్లస్టర్లు	51
సీఆర్పీలు	51

పకడ్బందీగా సర్వే



జిల్లాలో బడీడు పిల్లలు, బడిమానేసిన పిల్లల సర్వే పకడ్బందీగా చేపడతాం. తల్లిదండ్రులు సహకరించాలి. చిన్నారుల భవిష్యత్ కోసం బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలి. చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

గొల్లపల్లి(ధర్మపురి): ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతిచెందిన ఘటన గొల్లపల్లి మండలం చందోళి గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చొప్పరి భూలక్ష్మి (52) అల్లుడు తాళ్ల కృష్ణకు పసరికలు కాగా, పసరికల మందు కోసం భూలక్ష్మి అల్లుడితో కలిసి బైక్‌పై గొల్లపల్లి మండల కేంద్రానికి బయలుదేరింది. మార్గమధ్యలో చందోళి శివారులో రోడ్డుమీద గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పగా, బైక్ పైనుంచి కిందపడిన భూలక్ష్మి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అతివేగంగా బైక్ నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు మృతురాలి భర్త వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

బస్సు నుంచి కిందపడి విద్యార్థికి గాయాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద జగిత్యాల– కరీంనగర్ ప్రధాన రహదారిపై ఓ విద్యార్థి ఆర్టీసీ బస్సు నుంచి కిందపడగా స్వల్పగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన నవీన బుధవారం పాతబస్టాండ్‌లో వేములవాడ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. బస్‌డిపో వద్ద దిగేందుకు బస్సు ఆపాలని కండక్టర్, డ్రైవర్‌కు చెప్పగా వారు విన్పించుకోలేదు. విద్యార్థి దిగుతుండగా కిందపడటంతో స్వల్పగాయాలయ్యాయి. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వెళ్లిన నెల రోజులకే..

కోనరావుపేట(వేములవాడ): బతుకుదెరువు కోసం నెల క్రితం గల్ఫ్ వెళ్లిన ఓ యువకుడు అక్కడ జరిగిన ప్రమాదానికి బలికాగా.. వారం రోజులకు శవపేటిక ఇంటికి చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన లింగంపెల్లి రాజనర్సయ్య–లచ్చవ్వ కుమారుడు లింగంపల్లి బాబు(28) నెల రోజుల క్రితం బహ్రెయిన్ దేశం వెళ్లాడు. ఈ నెల 7న అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తుండగా సెంట్రింగ్ పనికి వినియోగించే పెద్ద రాడ్ నాలుగో అంతస్తు మీదనుంచి బాబుపై పడింది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందినట్లు తోటి స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజనర్సయ్య కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లచ్చవ్వ, భార్య శిరీష, నాలుగేళ్ల వయస్సు గల కుమారుడు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ గోలి మోహన్ అక్కడి ఇండియన్ ఎంబసీ వారితో మాట్లాడి మృతదేహం ఇంటికి చేరేందుకు కృషి చేశారు. బాబు శవపేటిక ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి బలవన్మరణం

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్య కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం నగరంలోని ఆటోనగర్‌కు చెందిన రామంచ సందీప్(27) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి వచ్చిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట శివారులో బుధవారం మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకయింది. దీంతో నీళ్లు ఎగిసిపడ్డాయి. కోరుట్ల నుంచి జగిత్యాల వైపు వెళ్లే పైప్‌లైన్ లీక్ కావటంతో నీటి సరఫరా నిలిపి వేశారు. అధికారులు పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. మరమ్మతు చేపడతామని తెలిపారు.

బస్సు రాక.. ఇంటికి చేరలేక

- మోడల్ స్కూల్ విద్యార్థుల ఇక్కట్లు
- రాత్రి 7.30 గంటల వరకు ఎదురుచూపు
- చివరకు నడుచుకుంటూ మల్లాపూర్ వరకు..
- అయోమయానికి గురైన తల్లిదండ్రులు..



పాతబస్టాండ్‌కు వస్తున్న విద్యార్థినులు

మల్లాపూర్: సకాలంలో ఆర్టీసీ బస్సు రాకపోవడంతో మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 4.40 గంటల నుంచి రాత్రి 7.30 వరకు వేచి చూసినా.. బస్సు మాత్రం రాలేదు. చేసేది లేక రాత్రి 7.30 గంటలకు సుమారు 40 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లాపూర్ పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ పిల్లలు ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు హైరానా పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్న విషయం తెల్సిందే. పథకం ప్రారంభం ముందు వరకు బస్సులు సకాలంలో నడిచేవి. వాటిలో మోడల్ స్కూల్ విద్యార్థులు వెళ్లేవారు. సమయానుకూలంగా బస్సులు నడవడంతో వారివారి గమ్యస్థానాలకు సకాలంలో చేరేవారు. అయితే ఉచిత ప్రయాణం నేపథ్యంలో మోడల్ స్కూల్‌కు వచ్చే మండలంలోని ఇతర గ్రామాలతోపాటు మెట్‌పల్లికి చెందిన విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ యజమాన్యం పాఠశాల సమయ వేళల్లో బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. బుధవారం కూడా ఇలాంటి పరిస్థితే తలెత్తింది. మోడల్ స్కూల్ సాయంత్రం 4.40గంటలకు ముగిసిన తర్వాత మండలంలోని కుస్తాపూర్, సిరిపూర్, రాఘవపేట, ముత్యంపేట గ్రామాలతో పాటు మెట్‌పల్లికి చెందిన 35 నుంచి 40మంది విద్యార్థినులు ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉన్నారు. చీకటి పడడంతో 2 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ మల్లాపూర్ పాతబస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా రాత్రి 7.30 గంటల వరకు వేచి ఉన్నా.. బస్సు రాలేదు. రాత్రి 7.40 గంటలకు బస్సు రావడంతో విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లారు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా, విద్యార్థినులు మోడల్ స్కూల్ వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సు నడపాలని మెట్‌పల్లి డిపో మేనేజర్‌కు సూచించారు.

కోరుట్లపై ఎంపీ అర్వింద్ మార్క్



ప్రచార సభలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్(ఫైల్)

- ప్రచారం తక్కువ.. ఓట్లు ఎక్కువ
- ప్రలోభాలకు దూరంగా.. ప్రజలకు దగ్గరగా..

కోరుట్ల: 'ఓటరుకు ఒక్క రూపాయి పంచం.. జీరో బడ్జెట్ పాలిటిక్స్‌కు కోరుట్లను వేదికగా మారుస్తాం' అని చెప్పిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లో అన్నంత పనిచేశారు. ఓటరును డబ్బుతో ప్రలోభపెట్టే సంస్కృతికి స్వస్తి పలికారు. కోరుట్ల అసెంబ్లీ బరిలో నిలిచిన అర్వింద్ తక్కువ ప్రచారం చేసి.. 61వేల పైచిలుకు ఓట్లు రాబట్టుకోవడం విశేషం.

పోలింగ్ బూత్ నిర్వహణకే..

సర్పంచ్ స్థాయి నుంచి ఎంపీ స్థాయి దాకా ప్రతి ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం కీలకంగా మారిందన్న విషయం బహిరంగ రహస్యం. ఎన్నికల బరిలో ఉండే చాలామంది గెలుపు కోసం బాటలు వేసుకోవాలన్న లక్ష్యంతో ఓటర్లను మభ్యపెట్టే యత్నాలు చేస్తుండగా.. ఓటర్లు సైతం తమకు ఎవరు ఏం ఇస్తారన్న రీతిలో వ్యవహరిస్తున్న వైనం ప్రజాస్వామ్య వ్యవస్థను కలవరపరుస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని భావించిన అర్వింద్.. కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లో దాన్ని అమలు చేసి చూపించారు. కోరుట్ల సెగ్మెంట్‌లో 262 పోలింగ్ బూత్‌లు, 2.40లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కేవలం బూత్ ఇన్‌చార్జిలకు మాత్రమే పదిహేను రోజుల పాటు భోజనాలు, కరపత్రాలు, ఇతర ప్రచారానికి డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. తన నామినేషన్ పత్రాల్లో కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థుల కన్నా అధిక మొత్తంలో ఆస్తులు, నగదు కలిగి ఉన్నట్లు చూపించినప్పటికీ చెప్పిన మాట ప్రకారం కేవలం అభివృద్ధి చేస్తానని, గెలిపిస్తే తాను చేయనున్న కార్యక్రమాలను వివరిస్తూ ముందుకెళ్లారు.

హడావుడి లేకున్నా..

బీజేపీ అభ్యర్థి అర్వింద్ ప్రధాని మోదీ దేశానికి వన్నె తెస్తున్న తీరుతోపాటు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని, పసుపు బోర్డు తెచ్చానని చెప్పి రైతాంగాన్ని ఆకట్టుకున్నారు. సెగ్మెంట్‌లోని కిందిస్థాయి పార్టీ క్యాడర్, నాయకుల నుంచి తాము గెలిచే స్థితిలో ఉన్నామని, పార్టీ బలహీనంగా ఉన్న చోట్ల ఓటర్లను ఏదో రూపంలో ప్రలోభ పెడితే బాగుంటుందని తీవ్ర ఒత్తిడి తెచ్చినప్పటికీ ఎంపీ అర్వింద్ మాత్రం ఆ సంస్కృతికి దూరంగా ఉన్నారు. ఇలా పెద్దగా ప్రచారం చేయకున్నా.. ఓటర్లను ఆకట్టుకున్న ఆయన కౌంటింగ్ రోజున బరిలో ఉన్న ఇద్దరు బలమైన ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించారు. గతంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ కోరుట్లలో బీజేపీకి 25వేల ఓట్లు రాలేదు. ఈ సారి మాత్రం ఏకంగా 61వేల ఓట్లు సాధించడం విశేషం.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలి



ఫిల్టర్‌బెడ్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: లీకేజీలు లేకుండా గ్రామాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులను కోరారు. బుధవారం మండలంలోని డబ్బాలో వాటర్‌గ్రిడ్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా డబ్బా గ్రామంలో జిల్లాలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరును అందించేందుకు మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్‌ను మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు అయితే వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరును అందించాలని తెలిపారు. భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డివిజన్ అధికారి శ్రీనివాస్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కమటం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ గంగాధర్, భగీరథ ఎస్ఈ రవీందర్, ఈఈ శేఖర్‌రెడ్డి, సతీశ్, డీఈలు ప్రేమ్‌కుమార్, ఆనంద్, ఏఈలు రాజేందర్, అఖిల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేయిర్ మేనియా



విద్యార్థుల ప్రదర్శనలు



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్సలెన్స్ స్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ఫ్యూజన్ ఫిస్టా డిసెంబర్ 2023 పేరుతో సైన్స్‌ఫేర్ మేనియా నిర్వహించారు. మండల విద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలంటే ఇవి ఎంతో అవసరమని, జీవితంలో విజ్ఞానశాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు సూక్ష్మ నీటిపారుదల, మానవ పరిణామం, ఆయుర్వేద ప్రాముఖ్యత, సూర్యచంద్ర గ్రహాల అపోహలు లాంటివి ఎన్నో ప్రదర్శించారు. ఇవి ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రజితరావు, శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.